అడవి దొంగలు

కె. వి. రమణ

జీపు రాజస్థాన్‌లోని సోనార్ అడవుల్లో ప్రవేశించి అరగంట అయ్యింటుంది.

ఎన్నో యేళ్ళ క్రిందట నిర్మించబడిన ఘాట్ రోడ్డు విశాఖపట్నం మెయిన్ రోడ్డుకన్నా అధ్వాన్నంగా వుంది. జీపు మాటి మాటికీ ఎగిరెగిరిపడుతూం టే స్వస్థలమయిన విశాఖనగరం పదేపదే గుర్తొస్తూ విచిత్రంగా నిద్ర పట్టేసింది.

ఒక్కసారి "ఢాం" అనే చప్పుడుతో తెలివొచ్చి చటుక్కున్న కళ్ళు తెరిచాను.

"టైరు పేలిందా?" ప్రశ్నించాను డ్రైవర్ని. కాదని నాకూ తెలుసు. అది తుపాకీ ధ్వని. కానీ తామింకా సోనార్ అడవుల్లో ప్రారంభదశలోనే వున్నాం. ఇంత వేగంగా శత్రువులు దాడిచేస్తారా? అదే సందేహం!

"సహీ సాబ్! ఎవరో చాటునుండి తుపాకీ పేల్చారు!" డ్రైవింగ్ సీటుకింద నక్కివున్న డ్రైవరు గజగజ వణు

అంటూ చెప్పాడు. ఇంతలో మరోసారి పేలింది తుపాకీ. విండో స్క్రీన్ భళ్ళున ముక్కలయి గుండు దాదాపుగా నన్ను రాసుకుంటూ పోయింది.

జీపులో వుంటే ప్రమాదం! దాడి ముందునుంచి జరుగుతోంది. సీట్లో వంగి నా ఫారూన్ గన్ అందుకున్నాను. జీపులోనుండి పాములా కిందకు జారి జీపు వెనక్కి చేరాను. చుట్టూ దట్టమయిన అడవి. లెక్కకుమించి రాబందులు ఆకాశంలో చక్కర్లు కొడుతున్నాయి. శత్రువులో, తామిద్దరమో శవాలుకాక తప్పదన్నమాట!

జీపు ప్రక్కనుండి ముందుకు చూశాను. 'ధన్'మనే చప్పుడుతో చురుక్కుమంది చెవి. అదే సమయంలో పొగ అంచవాగా ఓ గుబురు చెట్టు దిశలో రెండుసార్లు గర్జించింది నా ఫారూన్! ఫలితం వెంటనే కనపడింది. కెవ్వున ఆర్తనాదం. చెట్టుకొమ్మలు పటపటలాడుతూ నేలమీద దబ్బున చప్పుడయింది.

కొద్ది నిమిషాలు నిశ్శబ్దం. తుపాకీ చప్పుళ్ళుబట్టి అవి రెండూ వేరు వేరు జాతులు. కాబట్టి శత్రువులు యిద్దరన్నమాట! నెమ్మదిగా లేచి చెట్టు ఖాళీ అయిన దిశలో ఒకింత అప్రమత్తంగానే మోకాళ్ళమీద ప్రాకుతూ వెళ్లాను. జీపు ముందు భాగాన్ని చేరి ఖాళీ అయిన గుళ్ళు రెండూ లోడ్ చేశాను. తిరిగి నాలుగు గుళ్ళతో అవురావురుమంటోంది నా ఫారూన్!

తలపైకెత్తి ఎదురుగా చెట్లలో ఒకేఒక గుండు పేల్చి తిరిగి చటుక్కున కూర్చుండిపోయాను. గుండు నా తల మీదనుండి జవాబుగా వచ్చిందటునుండి. వెంటనే మెరుపులా లేచి శత్రువు తుపాకీ పేలిన దిశగా నా ఫారూన్ ట్రిగ్గర్ని మూడుసార్లు నొక్కాను. ఫారూన్

ఖాళీ అయింది. ఎదురుగా చెట్టుకయితం ఖాళీ అవుతూ కవ్వున అరచి కిందపడ్డాడు శత్రువు.

పదినిమిషాలు గడిచాయి. అరణ్యమంతటా మామూలు పరిస్థితులు నెలకొన్నాయి. రాబందులు ఆకాశాన్ని ఖాళీ చేసి భూమి దిశగా వాలుతున్నాయి. ఇక మీరు వెళ్ళొచ్చు అన్నట్టుగా! తుపాకీ జీపుకి ఆనించి సిగరెట్ వెలిగిస్తూ అన్నాను!

"మహావీర్!"

"జీ సాబ్!" సీటుకింద నుండి వుడుంపిల్ల మాదిరి పైకి వస్తూ జవాబిచ్చాడు డ్రైవర్ మహావీర్.

"ఇక పోదామా!"

"అచ్ఛా సాబ్" జీపు స్టార్టు చేశాడు మహావీర్.

మహావీర్ టకటకా గేర్లు మార్చి జీపును ముందుకు దూకించాడు విప్పారిన మొహంతో ఓ క్షణం వెనక్కి తిరుగుతూ.

"సాబ్! నువ్వు చాలా చురుకయిన వాడివి. తుపాకీ చప్పుడు వినపడగానే ఇక మన పని అయిపోయిందను కున్నాను" అన్నాడు.

చిరు నవ్వు నవ్వి సీటు వెనక్కి వాలుతూ కళ్ళు మూసుకున్నాను. శత్రువులు నేను వూహించిన దాని కన్నా ముందున్నారు. వాళ్ళ మొదటి ప్రయత్నం భగ్న మయింది. మున్ముందు ఇంకెన్ని అవాంతరాలో. అను క్షణం జాగ్రత్తగా వుండాలి; అనుకున్నాను. పోనార్ అడవుల్లోని అడవి దొంగలను మట్టుబెట్టటానికి రాజస్థాన్ ప్రభుత్వం నన్ను నియమించింది.

ఘాట్ రోడ్డు దిగి పల్లంలో ఓ రెండు ఫర్లాంగులు వెళ్ళి దుమ్ము రేపుకుంటూ ఓ రెండంతస్థుల కర్రల భవనం

ముందు ఆగింది జీపు.

సీటులోనుండి నెమ్మదిగా లేచి కింద అడుగు మోపాను. సోనార్ అడవిలో ఏకబిగిని సుమారు నూటయాభై మైళ్ళు ప్రయాణం చేసి వుంటాం. డ్రైవరు, నేను అవ వాలు లేకుండా మట్టి కొట్టుకుపోయాం. నల్లని జీపు ఎర్రని మట్టిరూపు దాల్చింది.

ఒంటిమీద అంగుళం దళసరిలో పేరుకుపోయింది ఎర్ర మట్టి. రెండు చేతులా బట్టలు దులిపాను. తట్టెడు బుగ్గి క్రింద రాలింది. జీపులో వున్న సరంజామాను మహావీర్ క్రింద పెడుతుండగా గెండంతకుల భవనంలోనుండి పరు గున వచ్చారు ఇద్దరు ఫారెస్టు గార్డులు. నా చేతిలో సామాన్లు అందుకున్నారు.

తుపాకీ భుజానికి తగిలించి ఆర్మీ కిట్ నేనే పట్టు కున్నాను. ఎత్తయిన దిబ్బమీద కట్టబడిన ఆ రెండంతకుల చెక్కల భవనమే ప్రభుత్వ ఫారెస్టు కార్యాలయం. సోనార్ అడవుల రేంజి ఆఫీసర్ గోవింద్ అగర్వాల్ చేయిచాచి సాదరంగా ఆహ్వానించాడు నన్ను.

సుమారు యాభై ఏళ్ళ వయసులో దబ్బపండులా వున్నాడాయన. అరణ్య జీవితానికి అలవాటు పడ్డ మనిషిలా రాటుదేరి వున్నాడు అగర్వాల్. ఎప్పుడూ చిరునవ్వు చిందించే మోము అతనిపట్ల యితరులకు గౌరవ భావాన్ని కలుగజేస్తుంది.

"మిష్టర్ విక్రమ్! మీ విషయం మినిస్ట్రీ ఆఫ్ ఫారెస్ట్స్ ద్వారా నిన్ననే మాకు మెసేజ్ వచ్చింది. గ్లాడ్ టు మీట్ యు అండ్ విష్ యు ఆల్ ద బెస్టు" అంటూ కుర్చీ చూపించాడు అగర్వాల్ తనొక కుర్చీలో ఆసీను డవుతూ.

అడవి దొంగల విషయంలో ఇద్దరం కొద్ది సేపు సంభాషణలు జరిపాం. మాటల సందర్భంలో సోనార్ పాలిమేరల్లోనే నాకు శత్రువులనుండి యెదురయిన స్వాగత సత్కారాల విషయం ప్రస్తావనకు వచ్చింది. ఆ విషయం వింటూనే మాటలు ఆపి కొద్దిసేపు నా మొహంలోకి ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయారాయన. చివరకు పెద్దగా నిట్టూరుస్తూ:

“ఏమయితే నేం! మనం అదృష్టవంతులం. నాకు తెలుసు వాళ్ళు ఇంతటితో ఆగరు. మై డియర్ బాయ్! నువ్వు చాలా జాగ్రత్తగా వుండాలి సుమా! ఓ.కే. ఇప్పటికిది చాలు. మిగిలిన విషయాలు రేపు మాట్లాడుకుందాం. ప్రయాణంవల్ల బాగా అలసివుంటావు. టేక్ రెస్టు!” అంటూ కుర్చీలోనుండి లేచారాయన.

అగర్వాల్‌కి గుడ్ బై చెప్పి పై అంతస్తులో నాకోసమని కేటాయించిన గది చేరాను.

కింద భాగంలో కొంత ఆఫీసుకుపోగా మిగిలిన వాటాలో అగర్వాల్ వుంటున్నారు. అగర్వాల్‌కి పిల్లా పీచూ లేరు. భార్యకు కొద్దిగా మతిభ్రమణం. ఆ కారణంగా ఆమెను పుట్టింట్లోనే వుంచారాయన. ఇన్ని బాధలు వుండీ ఏమీ లేనట్టు నిశ్చింతగా వుండడమే అగర్వాల్ ప్రత్యేకత!

స్నానం, భోజనం వగయిరాలు చకచకా పూర్తయ్యాయి. మరో ఆలోచన లేకుండా మంచంమీద నిద్రకుపక్రమించాను. సుదీర్ఘమయిన ఘాట్ రోడ్ ప్రయాణం. శరీరమంతా నజ్జయిపోయింది. ఇలా కళ్ళుమూసానో లేదో అలా నిద్రపట్టేసింది.

2

ఒళ్ళు తెలియని మత్తునిద్రలో సయితం చీమచిటుక్కుమంటే చటుక్కుమంటూ తెలివొస్తుంది నాకు. కళ్ళు తెరిచి వున్నపాటున కదలకుండగనే చుట్టూ చూశాను.

కిటికీ తలుపు తెరచుకొని నెమ్మదిగా లోనికి ప్రవేశిస్తున్నాడొక వ్యక్తి.

నేలకు సుమారు ముఫై అడుగుల ఎత్తులో, ఎక్కివచ్చేందుకు మరే ఆధారమూలేని పరిస్థితిలో వుందా కిటికీ! పడుకునేముందు తను అన్నీ పరిశీలించాడు. బహుశా కిటికీ చేరువలో వుండే వేపచెట్టుకొమ్మలనుండి యే తాడో వేలాడదీసి లోనికి చేరివుండాలా వ్యక్తి!

బాగా పొడవుగా బలంగా వున్నాడు. చీకటిలో కలిసిపోయేలా నల్లని ఛాయ. కిటికీవద్ద క్షణకాలం నిలిచి గదంతా పరిశీలనగా చూశాడు. నడుమున బిగించి కట్టిన పంచె తప్ప అతని ఒంటిమీద మరే ఆచ్ఛాదనలేదు. చిరుచెమటలతో తడిసిన శరీరంతో నల్లత్రాచులా నిగనిగలాడుతున్నాడు.

మొల దగ్గర తడిమాడు. మరుక్షణం చేతిలో తళుక్కుమంటూ ప్రత్యక్షమయ్యింది పిడిబాకు. చేయెత్తి నావైపు విసిరాడు బలంగా. రయ్ .. య్....మంటూ సూటిగా దూసుకువచ్చింది. సరిగ్గా నా గుండెల్లో దిగవలసిన బాకు నేను చటుక్కున ప్రక్కకు దొర్లడం వలన పరుపులో దిగబడింది.

వూహించని పరిణామానికి బిత్తరపోయి తత్తరపడ్డాడా వ్యక్తి. నేను లేచి నిలబడ్డాను. తలగడకింద పిస్టల్ దాదాపు నాకు అందుబాటులోనే వుంది. ఆ వ్యక్తిని గాయపర్చడమో, చంపడమో నా ఉద్దేశ్యంకాదు.

మామూలు పరిస్థితుల్లో వాణ్ని ప్రాణాలతో పట్టుకోవాలన్నదే నా ధ్యేయం!

వాడు చటుక్కున మొలకు వేలాడుతున్న ఒరలో నుండి ఓ కత్తిని లాగాడు. వంపుగా పదునుదేరి చీకటిలో సయితం తళుక్కుమంటోందది. పులులు పందులు ఒకే దెబ్బకు రెండు భాగాలు కాగల వేటకత్తి అది!

వికటంగా నవ్వుతూ కత్తిని విలాసంగా తిప్పుతూ ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తున్నాడా వ్యక్తి.

“అడవి దొంగల్ని ఒంటరిగా యెదుర్కొనగల వీరుడి వటగా! కాచుకో నా దెబ్బ!” అంటూ ఛెంగున దూకాడా వ్యక్తి.

నేను లాఘవంగా ప్రక్కకు గెంతాను. నా కుడి చేతిని శరీరంనుండి వేరు చేసేందుకు వువ్విళ్ళూరుతూ కిందకు దిగిన కత్తి మంచం దండాన్ని కసిగా రెండుముక్కలు చేసింది. నేను వెంటనే కుడికాలు మడిచి వాడి ప్రక్కలో తన్నాను బలంగా. మంచంమీదనుండి యెగురుతూపోయి అవతల పడ్డాడు వాడు.

రెట్టించిన కోపంతో లేచి తిరిగి మంచంమీదుగా యెగిరి నా మీదకు వస్తున్నాడు వాడు. నేను చటుక్కున మంచాన్ని పైకి తన్నాను కాలితో. మంచం హఠాత్తుగా వాడి కాళ్ళకు అడ్డుపడి నా కాళ్ళ దగ్గర కుప్పలా పడ్డాడు వాడు.

కుడి కాలు చాచి వాడి గడ్డంకింద తన్నాను. కెవ్వున అరుస్తూ మూడు మొగ్గలు వేసి తిరిగి కిటికీ దగ్గర పడ్డాడు వాడు. అన్ని దెబ్బలూ తనవే కావడం ఒంటికి కారం రాసినట్టుంది వాడికి. మొహం వికృతరూపం దాల్చింది.

కసాయివాడు పశువును నరికినట్లు నన్ను నిలువునా నరికి పోగులు పెట్టాలన్నంత కసి వాడి కళ్ళల్లో ప్రతిఫలిస్తోంది. వేటు కత్తిని రెండు చేతులాపట్టి యెత్తి భయంకరంగా అరుస్తూ నావేపు ముందుకురాసాగా డా వ్యక్తి.

నేను యేమాత్రం చలించక వాణ్ని బాగా చేరుక కానిచ్చాను. ఆ వ్యక్తి కత్తిని నా తలకు గురిచేసి ఒక్కసారిగా ముందుకు దూకాడు.

నేను మెరుపు వేగంతో ప్రక్కకు గెంతి బూటు కాలితో ఆ వ్యక్తి రెండు కాళ్ళమీదా తన్నాడు. ఆ విసురులో కాళ్ళు రెండు తేలిపోగా ముందుకు బోర్లా పడ్డాడు వాడు. వేట కత్తి ఆ వూపులో అదుపుతప్పి అతడి పొత్తికడుపులోనుండి వెన్నుపైకి దూసుకువచ్చింది. ఒకే ఒక్క మూలుగుతో ప్రాణాలు వదిలాడా వ్యక్తి.

ఇంతలో తలుపు దబదబా చప్పుడయింది. కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి తలుపు తెరిచాను. అగర్వాల్. చేతిలో పిస్తోలుతో:

"ఏమయింది....విక్రమ్....!" అంటూ కంగారుగా లోపలికి ప్రవేశించి ఎదురుగా కనబడిన దృశ్యంచూసి నిశ్చేష్టుడయ్యాడు. కొద్దిసేపటికి తేరుకుంటూ అతనే:

"మొదట కిందకు చప్పుడు వినపడితే యే ఎలకనో కొడుతున్నావనుకున్నాను" అంటూ చచ్చిన ఆ వ్యక్తిని సమీపించి బూటుకాలితో శవాన్ని ప్రక్కకు దొర్లించాడు. మరుక్షణం కళ్ళు పెద్దవిచేస్తూ.

"విక్రమ్! వీడు ఆ అడవి దొంగల్లో వ్యక్తే. పేరు భాంగ్రా. కొండజాతి వ్యక్తి. ఎన్ని హత్యలు చేశాడో లెక్కలేదు. రిక్త హస్తాలతో హత్యలు చేయడంలో వీడికి

ఏదే పాటి. అటువంటివాడి చేతిలో ఇంత దారుణమయిన ఆయుధం వుండీ నీ చేతిలో చచ్చాడు. ఏమో అనుకున్నాను. రియల్లీ యూ ఆర్ గ్రేట్!" అన్నాడు అగర్వాల్ అభినందనగా నా భుజం తడుతూ.

3

ఉదయం టిఫిను వగయిరాలు పూర్తిచేసి ఫారూన్ చేతబట్టి బయట షెడ్‌లో కట్టివున్న గుర్రాలలో ఒక దానిని పైకి లాగాను. సోనార్ అడవుల్లో ఫారెస్టు సిబ్బంది అంతా గుర్రాల్నే వాడతారు. గుర్రాన్ని అధిరోహించి వెళుతుండగా అగర్వాల్ మెట్లు దిగుతూ:

"హలో బాయ్! వెంట రానా" అన్నారు.

"నో! థాంక్స్! వూరకనే అలా రెండు చక్కర్లు కొట్టివద్దామనంతే!"

"ఎనీ హౌ! కొత్తగా! ఓ ఇద్దరు గార్డుల్నయినా."

"అక్కర్లేదు సర్! నే ఒక్కణ్ణే పోయిరాగలను.... బై .... బై ...." గుర్రాన్ని అదిలించాను.

అగర్వాల్ నిట్టూరుస్తూ "ఓ. కె. బి కేర్ ఫుల్" అన్నారు చేయి వూపుతూ. గుర్రం పెద్దగా సకిలిస్తూ అరణ్య మార్గం పట్టింది.

కనుచూపు మేర బ్రహ్మాండమయిన వృక్షాలు నిండి అడవి దట్టంగా వ్యాపించి వుందక్కడ. సన్నని బాటగుండా పరుగెడుతోంది అశ్వం. ఇంతలో దిక్కులు పిక్కటిల్లే శబ్దంతో పేలింది తుపాకీ. గుండు సరిగ్గా నా అశ్వం ముందు కాళ్ళ మధ్య గుండె ప్రాంతాన్ని చీల్చుకు పోయింది.

వెంటనే కుప్పకూలిపోయింది గుర్రం. గుర్రంతో పాటు కిందపడుతూనే జీనుకి తగిలించివున్న నా ఫారూన్ గన్ని

పైకి లాగుతూ ప్రక్కనే వున్న పొదల్లోకి దొర్లాను. రెండు మూడు తుపాకులు నామీద కసిగా ప్రయోగించబడినప్పటికీ నేను తెలివిగా తొందరగా తీసుకున్న నిర్ణయం వల్ల బ్రతికిపోయాను.

నామీద తుపాకులు పేల్చిన నలుగురూ చెట్ల చాటు నుండి బయటపడి ముందుకు రాసాగారు వేగంగా. నా చేతులు విద్యుత్తును మించి వేగంగా పని చేశాయి.

నలుగురూ ఆర్తనాదాలు చేస్తూ తుపాకులు వదిలి నేల కూలారు. ఫారూన్ తిరిగి లోడ్ చేస్తుండగా ధన్ మంటూ పేలిందో తుపాకీ. నా చేతిలో ఫారూన్ అల్లంత దూరాన ఎగిరిపడింది.

ముఖానికి నల్లని మాస్క్ ధరించిన వ్యక్తి ఎదురుగా నిలబడి వున్నాడు. దుస్తులు సయితం నల్లనివే ధరించాడు. అతని వెంట నలుగురు వ్యక్తులు తుపాకులు ధరించి వున్నారు.

"ఊఁ....ముందు వీణ్ణి కాళ్ళూ చేతులూ కట్టిపడేయ్యండి" అరిచాడు ముసుగు వ్యక్తి. మనిషి చూడగా ఆబోతును మించి వున్నాడు. గొంతు తీతువుపిట్ట అరిచి నట్టుంది.

నలుగురూ ఏకమయి నా చేతుల్ని వెనక్కి విరిచి కట్టేశారు. కాళ్ళు రెండూ ఓ పొడవాటి తాడుకు కట్టి రెండో కొసను యెత్తయిన చెట్టు కొమ్మపైనుండి కిందకు లాగారు. తలక్రిందులుగా వేలాడుతూ అలా పైకిపోయాను నేను. సరిగ్గా నా తలకు సూటిగా కింద నేలమీద ఐదారడుగుల మేర కర్రతో శూల్యాలు అప్పటికప్పుడు చేసినవి పాతిపెట్టారు.

వేలాడే తాడుకు ఒకడు నిప్పంటించి చెట్టుదిగిపోయాడు.

అందరూ గుర్రాలెక్కారు. ముసుగుమనిషి తలపైకెత్తి నన్ను ద్దేశించి:

"ఒరేయ్! .. నిజానికి నిన్ను చంపాలంటే ఒకే ఒక బులెట్ చాలు. కానీ నువ్విప్పటికి మా మనుషుల్ని చాలా మందిని పొట్టన బెట్టుకున్నావు. అందుకే నువు సులభంగా చావకూడదు. చచ్చేముందు క్షణాలు లెక్కపెడుతూ నరకయాతనపడు. అదే నీకు తగిన శిక్ష" అని కీచు కీచులాడి ఒక అనుచరుణ్ణి పిలిచి,

"నువ్విక్కడే వుండి. వీడి చావు కళ్ళారా చూసిరా!" అన్నాడు గుర్రాన్ని అదిలిస్తూ. మిగిలినవాళ్ళంతా పక పక నవ్వుతూ అతణ్ణి అనుసరించారు.

తాడు నెమదిగా కాలుతూ నన్ను క్షణక్షణం మృత్యువుకి చేరువుగా తీసుకుపోతోంది. తాడు పట్టుతప్పిన మరుక్షణం సూదికొయ్యలమీద తన చావు ఖాయం. రమారమి నలభై అడుగుల ఎత్తు. తలలో నాటిన కొయ్యలు గుండెల్ని దాటిపోతాయి. ఏ దేవుడో దిగి వచ్చి ఆ క్షణాన గాలిరూపంలో కొయ్యల్ని దాటించినా కింద తుపాకీ చేతబట్టి యముడి బాబులా వీడొకడు!

ముసుగు వ్యక్తి చెప్పినట్టు క్షణాలు లెక్కపెడుతున్నాను. తాడు దాదాపు సగం కాలింది. దాదాపుగా మృత్యువు నోటిలో వున్నట్టే లెక్క. చివరిక్షణాల్లో తెగించి ఒక నిశ్చయానికొచ్చాను. చావు ఎటూ తప్పదన్నప్పుడు ఏదో ఒక సాహసం చేసి చావడం ఉత్తమం కదా!

వూపిరి బిగించి శరీరాన్ని ముందు వెనుకలకు కదిలించాను. అందుకు తగ్గట్టు గాలిసయితం అనుకూలంగావుంది.

వుయ్యాలవూపు వచ్చింది త్వరలో. కింద కాపలా వాడికి నా వుద్దేశ మేమిటో అర్థంకాక ఆశ్చర్యపోతూ:

"ఏయ్! వేగంగా చావాలని వుందా? ఫూల్ ...."

అంటున్నాడు పెద్దగా. వూపు పెరిగింది ఒకేసారి. ఫటఫటలాడుతూ తెగింది తాడు. లెఖ్ఖ మేరకు రివ్వున పోయి ఆ వూపున అడవిదొంగ తలను తాకింది నా తల. అడవిదొంగకు కళ్ళు బైర్లుకమ్మాయి. తల పట్టుకుంటూ స్పృహ తప్పి నేలమీద పడిపోయాడు. నా తలా దిమ్మెక్కి దాదాపుగా స్పృహ తప్పినంత పనయింది. అయినా నేను దెబ్బ కాచుకు నేందుకు ముందే సిద్ధపడిన కారణంగా అంత పనీ జరగలేదు.

నెమ్మదిగా లేచి నిలబడి గెంతుకూపోయి నేలమీద పాతబడిన కొయ్యల మధ్య నా చేతి కట్లువుంచి అటూ యిటూ మెట్టగించాను. లతలతో కట్టిన కట్లు కావడం వలన ఒక్కొక్కటీ సులభంగానే తెగిపోయాయి.

కట్లు విదిల్చి తిమ్మిరెక్కిన చేతుల్ని రుద్దుకుంటూవున్న తరుణంలో స్పృహతప్పిన అడవిదొంగ తేరుకొని కంగారు పడుతూ తుపాకీ అందుకున్నాడు. అరక్షణం ఆలస్యమయితే నా ప్రాణాలు అనంతవాయువుల్లో లీనమయి పోతాయి.

నేలమీద పాతబడి వున్న కొయ్యల్లో ఒకదానిని చటుక్కున పీకి ఆ వూపున అడవిదొంగ దిశగా విసిరాను. అడవిదొంగ తుపాకీ పేల్చే సమయానికి కొయ్య సూటిగా వాడి గుండెల్లో దూరింది. తుపాకీ పేలింది. అదే సమయంలో అడవిదొంగ నోరు తెరిచి అరిచాడు బాధగా. తుపాకీ గుండు లక్ష్యాన్ని తప్ప ఎటో పోయింది. అడవిదొంగ కళ్ళు తేలేసాడు.

బాగా చీకటి పడుతుండగా ఫారెస్టు ఆఫీసు చేరాను. అప్పటికే అగర్వాల్ వాకోసమని మనుషుల్ని వెంట బెట్టుకు ప్రయాణమవుతున్నాడు.

"అరే విక్రమ్! వుదయమనగా వెళ్ళిన వాడివి. ఇంత వరకూ ఏం చేస్తున్నావ్" అన్నాడు అగర్వాల్ ఆందోళన పడుతూ.

జరిగింది చెప్పాను. "నే ముందే చెప్పలా! అడవిలోకి తోడు లేనిదే వెళ్ళకు ఇకనయినా" అన్నారు అగర్వాల్ మందలింపుగా.

4

మరుసటి రోజు నిద్ర లేస్తూనే టవల్ పట్టుకొని స్నానానికి బయల్దేరాను. ఆఫీసుకు నాలుగయిదు ఫర్లాంగుల దూరంలో ఒక వాగు ప్రవహిస్తూ వుంటుంది. ఆ వాగులో స్నానం చాలా సరదాగా వుంటుంది.

అగర్వాల్ మెట్లదగ్గర కుర్చీలో కూర్చొని దంత ధావనం చేస్తున్నారు.

"ఎక్కడికి? స్నానానికేనా! ఓ పది నిముషాలు ఆగు నేనూ వస్తాను." అన్నారాయన.

అతనితో నడిస్తే తొవ ఎంతకీ తరగదు. "మీరు రండి. నేను వాగు ఒడ్డున కూర్చుంటాను" అన్నాను.

గలగలా కరిగిన వెండిలా ప్రవహిస్తోంది వాగు. వాగు కిరుప్రక్కలా రంగు రంగుల పూలచెట్లు. చల్లని చిరుగాలి. ఆహ్లాదంగా వుంది వాతావరణం.

ఇంతలో వాగుకు అవతలినుంచి ఎవరో అరుస్తూవుండడం చెవినపడింది. అది పురుషుడి కంఠం.

"అయ్యో! ఎత్తుకుపోతున్నాడు.... నా భార్య.... రక్షించండి....రక్షించండి...." హృదయ విదారకంగా

వుందా స్వరం.

వెంటనే వాగులోకి దిగాను. అంతా కలిపి నడుము లోతు మించదెక్కడా. వాగు వెడల్పు మహావుంటే యాభై అరవై అడుగులు. రెండే నిముషాల్లో వాగు దాటాను.

ఒక కోయజాతి యువకుడు నన్ను చూస్తూనే "దొరా! వాడెవడో నా భార్యని పట్టుకుపోతున్నాడు. రక్షించండి...." అంటున్నాడు చేతిని గుబురు చెట్లలోపు దిశగా చూపుతూ. ఆ చేతిలో తళ తళ మెరుస్తూ వుందొక గండ్రగొడ్డలి.

"వాళ్ళెంతమంది?" ప్రశ్నించాను.

"ఒక్కడే దొరా!...." దుఃఖాన్ని దిగమింగుతూ బదులిచ్చాడు వాడు.

"చేతిలో పరుశువు వుండగా ఒక్కగానొక్క వెధవకి పెళ్ళాన్ని ఒప్పజెప్పి ఏడుస్తున్నావా! ....సిగ్గులేమా.... నువు కోయవాడివేనా" అన్నాను కోపంగా.

కోయవాడు సిగ్గుపడుతూ బాధగా "అదికాదు దొరా! నా కాలు...." అంటూ పెద్దగా కట్టుతో వున్న తన కుడి కాలు చూపించాడు. అదింకా రక్తాన్ని చిమ్ముతూనే వుంది.

"చెట్టుమీదనుండి పడ్డాను దొరా....! రెండ్రోజులే అయింది....అయినా పనిగత్తాను....విరిగిన కాలు కదా!" అన్నాడు కళ్ళవెంబడి నీళ్ళు జలజలా రాలుతుండగా.

ఏ సంగతీ విచారించకుండా తొందరపడి కోయ యువకుణ్ని తిట్టినందుకు సిగ్గుపడ్డాను. చటుక్కున వాడి చేతిలో పరుశువు లాక్కుని

"తొందరలో ఏదో అన్నాను....బాధపడకు....వాడు

అటేగా వెళ్ళింది!'' అన్నారు. మొదట ఆ యువకుడు చేయి చూపిన దిశగా చూపుతూ. కోయ యువకుడు కండ్లు తుడుచుకుంటూ,

"ఔను దొరా!....'' అన్నాడు.

నా కాళ్ళు యంత్రవేగాన్ని మించి అటు పరుగు తీసాయి. అలా ఓ పది నిముషాలు పరుగెత్తగా భుజాన ఒక స్త్రీని మోస్తూ కనుచూపు మేరలో ఒక వ్యక్తి పోతూ వుండడం కంటపడింది. నేను వేగాన్ని పెంచుతూ పరుగెత్తాను. చూస్తూ వుండగానే ఆ వ్యక్తి స్త్రీతో సహా ఒక పర్వత గుహలోకి ప్రవేశించాడు.

నేనూ ఆ గుహను చేరి లోపల అడుగు పెట్టాను. గుహ లోపల కటిక చీకటి.

నా మనసేదో కీడు శంకిస్తోంది. ఇదేదో ట్రాప్. శత్రువులు చాలా సులువుగా బోల్తా కొట్టించారు నన్ను. ఏమయినా ఫరవాలేదు. చేతిలో పరుశువుంది. ఎట్టి పరిస్థితుల్లోనయినా పదిమందికి జవాబు చెప్పగలను.

గోడల్ని తడుముతూ లోనికి ప్రవేశించాను. అప్పటికి నా కళ్ళు సయితం చీకటికి బాగా అలవాటుపడ్డాయి.

గుర్ ....ర్ ....ర్ ....మళ్ళీ చప్పుడు...ఉలిక్కిపడుతూ తిరిగానటు.

గుహలో ఓ మూల కర్రలబోను....దీక్షగా నా వంకే చూస్తోంది పెద్దపులి. మసక చీకటిలో దాని కళ్ళు దీపాల్లా వెలుగుతున్నాయి.

బోను తలుపు తెరిచే వుంది. చటుక్కున లేచి నిలబడింది పులి. బలిసిన దున్నలు రెండింటిని అవలీలగా ఎగరేసుకుపోయే సత్తా వుంది దానికి. ఎక్కడా సొట్ట లేని శరీరం నూనె రాసినట్టు తళతళ మెరుస్తోంది. కడుపు

వెన్నుక అంటి వుంది. ఆకలితో నకనకలాడుతోందన్న మాట.

పులి గుర్రు పెడుతూ బోనులోనుండి పైకిఅడుగు పెట్టింది. గండ్రగొడ్డలిని రెండు చేతులా బిగించి పట్టుకున్నాను.

పులి అడుగులు లెక్క పెడుతూ ముందుకు వస్తోంది. నేను కదలకుండా నిలబడి వున్నాను. దరిదాపుల కొచ్చింది పులి. ఇక నడిచే ప్రశ్న లేదు. నేను సిద్ధంగానే వున్నాను.

పెనుగాలిలా విరుచుకుపడింది పులి. ఒడుపుగా ప్రక్కకు జరిగి గొడ్డలితో దాని మెడమీద వేసాను సరిగ్గా.

ఆ దెబ్బకు పులి తల తెగి నేలమీద పడాలి. కానీ విచిత్రంగా నా గొడ్డలే కర్రతో సహా ముక్కలయి నేల మీద చెల్లాచెదురయి చిన్న కర్రముక్క మాత్రం చేతిలో మిగిలిపోయింది.

నివ్వెరపోయాను. గొడ్డలిని చాలా నేర్పుగా అతికారు. పులి వెనక్కు తిరుగుతోంది. విరిగి ముక్కలయిన గొడ్డలికోసం విచారిస్తూ కూర్చుంటే ప్రయోజనముండదు.

రిక్తహస్తాలతో పులిని యెదుర్కోవడం వెర్రితనమే అవుతుంది. నేను క్షణమయినా వృథా చెయ్యక రెండే అంగల్లో పులి బోనులో దూరి తలుపు వేసుకున్నాను. పులి పిచ్చెత్తినట్టు బోనుచుట్టూ తిరుగుతూ నానా రభసా చేస్తోంది.

ఇంతలో కిలకిలమంటూ ఓ స్త్రీ స్వరం "మొత్తానికి వీరుడివే! పులికి భయపడి బోనులో దాక్కున్నావు" అపహాస్యంగా పకపకలాడిందామె.

చుట్టూ చూశాను. మనిషి కనపడలేదెక్కడా.

గుహాకు యేవో మూల వున్న చిన్న కంతలో నుండి శత్రువులు వ్యవహారమంతా కనిపెడుతున్నారన్న మాట!

నాలో పౌరుషం పెల్లుబికింది. బోను కట్లు వూడదీసి ఒక నిలువు కర్రను లాగాను. మూడడుగుల పొడవులో సరయిన దుడ్డుకర్ర అమరింది. ఈ మాత్రం ఆధారం చాలు నాకు. పులిని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు త్రాగించగలను. బోను తలుపును కాలితో తన్నాను బలంగా. గడియ వూడి తెరుచుకుంది తలుపు. ధీమాగా బయట అడుగు పెట్టాను.

పులి నాలుక తడుపుతూ హుంకరించిందొకసారి. రెండడుగులు వెనక్కి పోయి లంఘించిన వేగంతో రాకెట్‌లా నా పైకి దూకింది. నేర్పుగా ప్రక్కకు తిరిగి పులి వీపుమీద కర్రతో ఓ బాదు బాదాను. బంతిని కొట్టినట్టు వెనక్కి విసురుగా వచ్చింది కర్ర. బాగా కండబట్టివుంది పులి. ఇటువంటి దెబ్బలిస్తే ఒంటిమీద ఏమాత్రం లెక్క చెయ్యదు.

పులి గాండ్రు పెడుతూ దూసుకువస్తోంది. బాగా దగ్గర కానిచ్చి ముందు కాళ్ళు రెంటినీ కర్రతో పరామర్శించాను. బొర్లాపడుతూ పులి పిల్లి మొగ్గలు వేసింది. అదే అదనుగా బుర్రమీద మరో రెండు తగిలించాను.

పులి బుర్ర విదుల్చుతూ లేచి నిలబడింది. ముందు కాళ్ళు తడబడుతున్నాయి. గాండ్రింపు తగ్గింది. నాలో ఉత్సాహం పెరిగింది. ఈసారి నేను హుంకరించాను పెద్దగా. పులి ఒళ్ళు దులుపుకుందొకసారి. రోషంగా నామీదకు వచ్చింది మరోసారి.

తిరిగి అదే దెబ్బ! గడ్డం నేలను తాకగానే నేలమీద కొంతదూరం జారుతూ పోతోంది ఆ వూపున. ఆ దశలో

పులి వెనక కాళ్లను సయితం యధాశక్తి దుడ్డుకర్రతో అవి రామంగా బాదుతుంటూ పోయాను.

పులికి దుడ్డుకర్ర సామాన్యమైంది కాదని తెలిసి పోయింది. వెనక్కి తిరిగి చూడకుండా అలా ముందు కాళ్ళమీదే దేకుతూ బోనులో దూరి బుద్ధిగా పడుకుంది. వెంటనే బోను తలుపు మూసి తాడుతో కట్టేశాను.

దుడ్డుకర్ర పక్కన పెట్టి బోనుకు జారబడి నిల్చు న్నాను. సిగరెట్ వెలిగించి గుండెలనిండా పొగపీల్చి వదిలాను. చిన్నగా నవ్వుతూ:

"మెడిచుర్! లేడీ! మీ దగ్గర ఇంకా పులులేవన్నా మిగిలివుంటే పంపించండి...పాపం! నా దుడ్డుకర్ర ముచ్చట పడుతోందింకా....!" అన్నాను.

అటునుండి ఏ జవాబులేదు. ఓ ఐదు నిమిషాలు అక్కడే వుండి సిగరెట్ పీకను మూలకు విసురుతూ గుహ బయటికి నడిచాను.

వాగు చేరేసరికి అగర్వాల్ ఒడ్డున నిలబడి దిక్కులు చూస్తున్నాడు. నన్ను చూస్తూనే ఆశ్చర్యంగా:

"అటు దేనికి వెళ్ళావు? ఆ వాలకమేమిటి?" అన్నాడు.

సంగతంతా చెబితే నానా గొడవ చేస్తాడని "వూరక నే అలా కొండచుట్టూ పరుగెత్తి వచ్చాను" అన్నాను.

అగర్వాల్ నన్ను వింతగా చూసి "నువ్వొక విచిత్ర మయిన వ్యక్తివి" అన్నాడు తను స్నానానికి వాగులోకి దిగుతూ.

5

అడవి బాటలో గుర్రంమీద వెళుతున్నాను. ఘాట్ రోడ్డు అర ఫర్లాంగు దూరంలో వుంది. లారీ ఒకటి రోడ్డు

మీద వెళుతుండటం కనిపించింది. లారీలో కర్రబోనులు వున్నాయి. గుర్రాన్ని అటు మళ్ళించాను. లారీలో వ్యక్తులు నన్ను చూసారో ఏమో ఒక్కసారిగా లారీ స్పీడందుకుంది.

తిన్నగా వెళితే గుర్రం యెంత వేగంగా వెళ్ళినా లారీని అందుకోవడం కష్టం. అందుకే అడ్డు తోవలు పట్టాను. గుర్రం హైవే చేరేసరికి లారీ అందీ అందనట్టు వెళుతోంది. క్రమేపీ ఆ దూరం పెరుగుతూ లారీముందుకు పోతోంది. ఇక లాభంలేదని తుపాకీ అందుకున్నాను. లారీ వెనక టైర్లు బ్రద్దలయ్యాయి. కేబిన్‌లోనుండి దూకి పారిపోతున్నాడు డ్రైవరు.

నా చేతిలో ఫారూన్ మరోసారి గర్జించింది. డ్రైవర్ కాలుమీద షూట్ చేసి వాణ్ణి ప్రాణాలతో పట్టుకోవాలన్నది నా ఆలోచన. కానీ వాడు అతితెలివికి పోయి ఒక్కసారిగా నేలమీద కూర్చుండిపోయాడు. సరిగ్గా కాలికి తగలవలసిన గుండు వెన్నులో నాటి ఛాతీని చీల్చుకుపోయింది.

డ్రైవర్ని సమీపించాను. వాడి ప్రాణాలు ఎప్పుడో పోయాయి. డ్రైవర్ని గుర్తుపట్టాను. నిన్నటిరోజు వాగు దగ్గర తన భార్యను యెవడో ఎత్తుకుపోతున్నాడని చెప్పి నన్ను పులికి అప్పగించిన వాడే వీడు!

లారీ వెనక రెండు బోనుల్లో పులులూ, సింహాలూ కిక్కిరిసి వున్నాయి. రెండు బోనుల తలుపులు తెరిచాను. జంతువులన్నీ పరుగులుతీస్తూ అడవిలో అదృశ్యమయ్యాయి.

ఆఫీసుకు తిరిగివచ్చి లారీ ఓనరుకోసం ఎంక్వయిరీ చేస్తే అది కిషన్‌లాల్‌దని తెలిసింది. కిషన్‌లాల్‌ని ఎన్ని రకాలుగా ప్రశ్నించినా అతడు చెప్పే సమాధానంమాత్రం

ఒక్కటే.

"విక్రమ్ సాబ్! ఆ లారీ నాదే! కానీ ఆ డ్రైవరెవడో నాకు తెలియదు. అందులో రవాణా చెయ్యబడుతున్న జంతువుల సంగతి నాకు అసలే తెలియదు. ఆ లారీని నిన్న రాత్రే యెవరో ఎత్తుకపోయారు. ఆ విషయం పోలీసులకు కంప్లయింటు యిద్దామని హాజ్రాపూర్ బయల్దేరుతూ వుండగా మీరు యెదురయ్యారు. ఇదిగో నా జేబులో వుంది రిపోర్టు కాగితం. కావాలంటే చూడండి" అంటూ ఓ కాగితం నా చేతికందించాడు కిషన్‌లాల్.

నిజమే! కిషన్‌లాల్ తన లారీ ఒకటి ఫలానా నంబరుగలది పోయిందని పోలీసులకు రాసిన విన్నపమది. ఆ కాగితాన్ని కిషన్‌లాల్ చేతికిచ్చాను. వీళ్ళు అన్నిటికీ సమర్థులు. అలా కాకపోతే ఒక ప్రభుత్వాన్ని ఇన్ని తిప్పలు పెట్టి తప్పించుకు తిరగడమంటే మాటలా మరి!

నేను వెనక్కి తిరిగి నడుస్తూవుంటే వెనకనుండి కిషన్‌లాల్ "సాబ్! ఏమయితేనేం నా లారీ నా కప్పగించి బోలెడు శ్రమ తప్పించారు నాకు. కనీసం కాఫీ అయినా తీసుకోకుండా వెళ్ళిపోతున్నారా" అన్నాడు బాధగా.

ఎంత చక్కని నటన! అది ఒకరకంగా నన్ను ఎగతాళి చెయ్యడమేగా! టక్కరి వెధవా! ఏదో రోజున నా చేతికి చిక్కకపోతావా! కసిగా మనసులో కిషన్‌లాల్‌ని తిట్టుకుంటూ వడిగా నిష్క్రమించా నక్కడనుండి.

ప్రతిరోజూ వీలయినంత మేర సోనార్ అడవుల్ని చుట్టివస్తున్నాను. శత్రువుల ఆచూకీ లభించడంలేదెక్కడా! శత్రువులకు ఎక్కడో ఒక రహస్య స్థావరం వుండితీరాలి! లేకుంటే ఇన్నాళ్ళు ఇంత పకడ్బందీగా

కార్యక్రమం జరపడం సాధ్యంకాదు ఎవరికీ.

అడవిలో నివసించే కోయజాతివాళ్ళను శత్రువుల ఆచూకీ కోసం ఎన్నో ప్రశ్నలు వేశాను. అందరిదీ ఒకటే సమాధానం. ఏ భావమూ కనపడని కళ్ళతో ఆకాశం లోకి చూసి పెదవి విరుస్తూ పోయేవారు.

ఆ మాటే అగర్వాల్‌తో అంటే ఆయన పెద్దగా నిట్టూరుస్తూ "విక్రమ్! మొదట కొందరు ఆటవికులు మనతో సహకరించి ఆ అడవి దొంగల్ని పట్టిచ్చే ప్రయత్నాలు చేశారు. అందుకు ప్రతిఫలంగా వాళ్ళు కుటుంబాలతో సహా అడవి దొంగల దారుణకృత్యాలకు బలయి పోయారు. అంతే! నాటినుండీ వాళ్ళు మనం పలకరిస్తే నే భయపడి పారిపోవడం ప్రారంభించారు" అన్నాడు.

"కావచ్చు! ఎన్నాళ్ళిలా! కొన్నాళ్ళు ఇలా గడిస్తే సోనార్ అడవుల్లో మనుషులూ వుండరు; జంతువులూ వుండవు. అసలు సోనార్ అడవే వుండదు" అన్నాను నిరాశగా.

అగర్వాల్ బాధగా నవ్వుతూ "నిజమే! కానీ ఏం చెయ్యగలం. కొత్తలో నేనూ ఏదో ఒకటిచేసి ఈ అడవిని రక్షించాలనుకున్నాను. కానీ క్రమేపీ అది అసాధ్యమని గ్రహించి రోజులు వెళ్ళబుచ్చడం నేర్చుకున్నాను. ఏం చెయ్యను? వాళ్ళను బంధించడానికి వెళ్ళిన మనుషుల్ని ఎందరినో కాళ్ళూ చేతులూ తెగనరికి చెక్కపెట్టెల్లో తెచ్చి ఈ ఆఫీసుముందు పడేసిపోయే వారు. విక్రమ్! ఆ దృశ్యాలను కళ్ళారా చూసిన వాడెవడూ కోరి అడవి దొంగల జోలికిపోరు. అది తలచుకుంటే నాకు ఇప్పటికీ శరీరం వణుకుతుంది...." అంటూ నెమ్మదిగా లేచి తన గదిలోకి వెళ్ళిపోయిరాయన.

6

అరణ్యంలో నెమ్మదిగా నడుస్తున్నాను. అగర్వాల్ మాటలే అనుక్షణం మదిలో మెదులుతూ వుండగా ఆ క్షణం కొంత నిర్లక్ష్యంగా వున్న మాట నిజం! ఇంతలో సర్మనే చప్పుడు వినపడి తలపైకెత్తాను. కానీ అప్పటికే ఆలస్యమయిపోయింది.

పెద్ద వల ఒకటి చెట్టుమీదనుండి సూటిగా వచ్చి నన్ను ముంచివేసింది. ఆ విసురుకు నేను కిందపడ్డాను. వల నన్ను కప్పివేస్తూ నేలంతా ఆక్రమించింది. అంతలోనే మరో వల, మరో వలా; అలా మూడు వలలు నామీద పడి నాకు కదిలే అవకాశమే లేకుండా చేశాయి.

చుట్టూ చెట్లమీదనుండి అడవి దొంగలు కేరింతలు కొడుతూ కిందకు దుమికారు. అంతా కలిసి సుమారు పది పన్నెండుమంది వుంటారు. వారిని ఆజ్ఞాపిస్తూ ఒక వ్యక్తి నా కాళ్ళూ చేతులూ కట్టెయ్యమన్నాడు. కాళ్ళూ చేతులూ కట్టబడి కటిక నేలమీద పడివున్నాను నేను.

"వీణ్ణి ఇక్కడే సఫా చేసేద్దాం" అన్నాడొకడు.

"కుక్కను కాల్చినట్టు కాల్చాలి వీణ్ణి మనవాళ్ళను ఎందరినో చంపాడు వీడు" కసిగా కాలితో తన్నుతూ అరిచాడొకడు.

నన్ను ఎక్కడ చంపాలి; ఎలా చంపాలి; అన్నది వాళ్ళకు చర్చనీయాంశమయింది.

"ఎందుకొచ్చిన గొడవ. వీడసలే చిచ్చర పిడుగు. ఏమాత్రం వీలుచిక్కినా ముందు మనందరినీ మట్టుపెట్టి మరీ తప్పించుకుపోతాడు" అన్నారు కొందరు.

"ఆ భయం దేనికి? కాళ్ళూ చేతులూ కట్టేసాం గదా! కాకపోతే మరో నాలుగు కట్లు కట్టండి. బాస్

దగ్గరికి తీసుకుపోదాం వీణ్ణి....” అన్నారు కొందరు.

“బాస్ వీణ్ని కనిపిస్తే కాల్చెయ్యమని చెప్పాడు..” మరొకడి మాటది.

ఏదోలా వీళ్ళు ఆ బాస్ దగ్గరికే నన్ను తీసుకుపోతే బాగుండును. ఈలోగా కొంత సమయం చిక్కి ఏదోలా తప్పించుకునే అవకాశమయినా వుంటుంది. అదేమీ కుదరకపోతే ఇక తను చచ్చినవాడికిందే లెక్క.

చివరకు అదే జరిగింది .... “వీణ్ని యిక్కడే చంపి శవాన్ని బాస్‌కి చూపితే సరి....” అనుకున్నారంతా!

అడవి దొంగలు నన్ను ఓ చెట్టుకి వురితీసే నిర్ణయంలో పడ్డారు. పనులన్నీ చకచకా సాగిపోతున్నాయి. ఓ పొడవాటి తాడు తెచ్చి చెట్టుకొమ్మకు వేలాడేసారు. తాడు చివర జారుముడి వేశారు. నన్ను పైకెత్తి ఓ గుర్రం మీద కూర్చోబెట్టారు. గుర్రాన్ని చెట్టుకింద నిలబెట్టి జారుముడి నా పీకకు తగిలించారు.

గుర్రం వెనకే నిలబడి వున్నాడొకడు. “ఒరేయ్! చచ్చేముందు దేవుణ్ని తలచుకో” పకపకా నవ్వుతూ అన్నాడొకడు. మిగిలిన వాళ్ళంతా వాడి నవ్వుతో శ్రుతి కలిపారు.

జీవితంలో చివరి ఘడియలు! దుఃఖం ముంచుకు వచ్చింది నాకు. చస్తున్నాననికాదు. అనుకున్నది సాధించలేకపోయినందుకు. సోనార్ అడవిలో జంతువుల్ని, మనుషుల్ని ఈ దుర్మార్గులకు అప్పగించిపోతున్నందుకు. భగవంతుడా....! ఈ సోనార్ అడవిని నువ్వే కాపాడాలి....!

గుర్రం వెనక నిలబడినవాడు కాలితో దానిని ఓ తాపు తన్నాడు. వులిక్కిపడుతూ చెంగున ముందుకు దూకింది

గుబ్బం! నా మెడ ఉరితాడులో ఇరుక్కుపోయింది. శరీరమంతా కేవలం మెడను బిగుసుకున్న తాడు ఆధారంగా గాలిలో వ్రాలుతోంది. ఊపిరి స్తంభించింది. గాలికి రెపరెపలాడే దీపంలా చివరిసారిగా కొట్టుకుంటోంది ప్రాణం.

ఇంతలో ఏదో చప్పుడు. తుపాకీ పేలిందెక్కడో. నా ప్రాణాలను పట్టి లాగుతున్న తాడు ఫట్‌మంది. దబ్బున నేలమీద పడింది నా శరీరం. నిర్విరామంగా తుపాకుల ధ్వని. పెద్దగా కేకలు....

కళ్ళు తెరిచాను నెమ్మదిగా. చేతిలో తుపాకీ ధరించి ఆతృతగా నా మొహంలోకి వంగి చూస్తున్నారు ఫారెస్టు ఆఫీసర్ అగర్వాల్. అగర్వాల్ వెనక ఓ ఐదుగురు గార్డులు తుపాకులు చేతబట్టి నిలబడి వున్నారు. పరిస్థితి అర్థమయింది నాకు. ఆఖరి క్షణంలో అగర్వాల్ నా పాలిట దేముడిలా వచ్చారు.

అగర్వాల్ తృప్తిగా నిట్టూరుస్తూ "ఆర్ యు ఓ.కె. మైడియర్ బాయ్!" అని ప్రశ్నించారు. చిన్నగా నవ్వుతూ తలూపి అడిగాను.

"దుండగు లెవరయినా పట్టుబడ్డారా....?"

నిస్పృహతో పెదవి విరిచారు అగర్వాల్ "వెధవలు తప్పించుకు పారిపోయారు...." అన్నారు....

7

మరుసటి రోజు తెల్లవారేసరికి పూర్తిగా జంగిల్ యూనిఫాంలో చకచక మెట్లు దిగుతున్న నన్ను చూసి నివ్వెరపోయారు అగర్వాల్.

"విక్రమ్! .... నువ్వసలు మనిషివా....! లేక పిశాచానివా....ఆ మెడ వాపే తగ్గలేదింకా...." అన్నారు కోపంగా.

నేను నవ్వుతూ అశ్వశాలలోకి వెళ్ళి ఓ గుఱ్ఱాన్ని లాక్కొచ్చాను.

"ఎంత చెప్పినా నీ పంతం నీదే....!" చిరాగ్గా లోనికి వెళ్ళిపోయారు అగర్వాల్.

నేను చిరునవ్వుతో అశ్వాన్ని అదిలించాను. పెద్దగా సకిలిస్తూ అడవిదారి పట్టింది అశ్వం.

నలుదిక్కులా దట్టమయిన అడవి. ఏ క్షణాన యేటు నుండి దాడి జరుగుతుందో! ఊహించడం కష్టం. అశ్వాన్ని నెమ్మదిగా పోనిస్తున్నాను.

దరిదాపుల్లో పులి గాండ్రింపు విని ఉలిక్కిపడింది అశ్వం. కళ్ళెం బిగించి గుఱ్ఱాన్ని సముదాయిస్తూ దాని మెడ నిమిరాను. మరోసారి వినపడింది పులి అరుపు. కానీ ఆ అరుపులో పులికి సహజమయిన గాంభీర్యం, కరకుదనం లేదు. ఏమయింది పులికి? ఎందుకలా నిస్సహాయత ధ్వనిస్తుందా గొంతులో.

అరుపు వినపడిన దిశగా గుఱ్ఱాన్ని నడిపించాను. పులి అరుపు మరోసారి వినపడింది; ఈసారి మరింత స్పష్టంగా; ఎక్కడో బావిలోనుండి వచ్చినట్టు. ముందుకు వెళ్ళాను పరిసరాల్ని గాలిస్తూ. విషయం బోధపడింది. నిజానికి పులి బావిలోనే వుంది. కాకపోతే అందులో నీళ్ళులేవు.

ఎవరో తీసిన గోతిలో వచ్చి పడింది పులి. ఎవరో ఏమిటి....? ఇది నిస్సందేహంగా ఆ అడవి దొంగల పని. జంతువులను పట్టేందుకు తవ్విన గొయ్యది. గోతిమీద అడులూ చెత్తాచోసి జాగ్రత్తగా కప్పివుంచారు. అడవుల్లో జంతువుల్ని పట్టడంలో ఇదొక పద్ధతి. అడవి దొంగలు యేదో ఒక సమయంలో ఈ గోతి వద్దకు తప్పకుండా వస్తారు.

చుట్టూ కలయజూసి అనువయినచోట మాటువేస్తూ నాలో నేనే నవ్వుకున్నాను. వేటగాడిగా గతంలో మేకనో, గొర్రెనో ఎఱగా వుంచి పులికోసం కాపు కాసేవాణ్ని; ఇప్పుడు యేకంగా పులినే ఎఱగా మనిషి కోసం కాపు కాస్తున్నాను.

సుమారు రెండు గంటలు గడిచాయి. ఆకుల చప్పుడు వినపడింది. ఎవరో వస్తున్నారు. అడుగుల చప్పుడుబట్టి వస్తున్నది ఒక్కరే అని తెలుస్తోంది.

ఖాకీ దుస్తులు ధరించి మంచి ఒడ్డూపొడవూ కలిగిన వ్యక్తి ఆదరాబాదరాగా వెళ్ళి గోతిలోకి తొంగిచూస్తున్నాడు. మనిషి అలికిడి విని గోతిలో కాళ్ళు బారజాపి పడుకుని వున్న పులి గాండ్రిస్తూ లేచింది.

అడవి దొంగ మొహం ఒక్కసారిగా వెలిగిపోయింది. గొప్ప బారయిన పులి. మంచి రేటే గిట్టుబాటవుతుంది. బాస్ తనకి మంచి బహుమతే ఇస్తాడు! గిరుక్కున వెను తిరిగిన అడవి దొంగ మొహం ఒక్కసారిగా మాడి పోయింది.

కట్టెదుట మరో పులిలా నిలబడ్డ నన్ను చూసి క్షణ కాలం తడబడ్డాడా వ్యక్తి. అంతలో నే నా చేతుల్లో పరలోకప్రాప్తి పొందిన తన సహచరులు గుర్తుకు వచ్చారో యేమో ఒక్కసారిగా తెగింపు కనపడిందా మొహంలో.

“హేయ్....! నిన్నూ....!” అంటూ తన చేతుల్లో ఓ తుపాకీ వుందనేమాటకూడా మరచి ఆవేశంగా నామీదకు దూసుకురాసాగాడా వ్యక్తి. అతణ్ని బాగా చేరువ కానిచ్చి చటుక్కున ప్రక్కకు గెంతాను. ఆబోతులా ముందుకుపోతున్నవాణ్ని ఫారూన్ మడమతో ఓ పోటు

పొడిచాను.

నడుం కలుక్కుమనగా బావురు కప్పలా అరుస్తూ బోర్లా పడ్డాడు వాడు. అతడి చేతిలో తుపాకీ అల్లంత దూరాన యెగిరిపడింది అప్పుడు జ్ఞాపకం వచ్చింది వాడికి తన చేతిలో ఓ తుపాకీ వుందని. ఆత్రంగా లేచి అటు పరుగెత్తబోయాడు.

రెండే అంగల్లో వాణ్ణి సమీపించి రెండు చేతులా పట్టిన ఫాయూన్‌తో వాడి గడ్డంకింద కొట్టాను. తుపాకీ మడములన్నిటిలోనూ ఫాయూన్ మడము మహాగట్టిది. ఆ దెబ్బకు వాడి కళ్ళముందు ఇంద్ర ధనుస్సు ప్రత్యక్షమయింది. చెవుల్లో నయాగరా జలపాతం హోరును మించిన అలజడిని భరించలేక చెవులు రెండూ మూస్తూ బాధగా అరిచాడు.

ఆ వూపున వాడికి మరో అవకాశమివ్వకుండా వడి కాలు మడిచి పొత్తి కడుపులో ఓ తన్ను తన్నేసరికి దెబ్బతిన్న కందిరీగలా కిందపడి గిరికీలు కొట్టసాగాడు. వాణ్ణి కాలితో తన్నుతూ గోతివరకూ దొర్లించుకు పోయాను. మరో తోపుకు తిన్నగా పోయి గోతిలో పడతాడు వాడు. పులి ఆకలితో నకనకలాడుతూ వుందేమో; నానా హంగమా చేస్తోంది కింద. పరిస్థితి గమనించి బావురుమంటూ నా కాళ్ళు రెండూ పట్టేసాడు వాడు.

“చెప్పు....! మీ స్థావర మెక్కడ?....మీ నాయకుడెవరు?” జుట్టుపట్టి తల పైకిలేపుతూ ప్రశ్నించాను వాణ్ణి.

“తెలియదు!” అన్నాడు వాడు నా చేతిలో వున్న జుట్టును విడిపించుకునే ప్రయత్నంలో తలవిదిలిస్తూ,

నిజానికి ఇటువంటి వెధవల్ని కనికరించకూడదు. జుత్తు వదలి వాడ్ని రెండు కాళ్ళమీద తన్నాను.

గోతిలో అడ్డంగా పొర్లుతూ చేతులతో అంచుపట్టుకు వేలాడాడు. పులికి అందీ అందనట్టువుంది వాడి పరిస్థితి. పైకి ఎగబ్రాకాలనే వాడి ప్రయత్నాన్ని వారిస్తూ బూటుకాళ్ళతో వాడి చేతుల్ని నొక్కసాగాను. క్రమేపీ వాడి చేతుల్లో సత్తా అయిపోయింది.

"బాబూ.... చెబుతాను.... నన్ను వదిలెయ్యండి....! ఏడుస్తూ ప్రాధేయపడ్డాడు వాడు.

గోతి అంచున మోకాళ్ళమీద కూర్చుంటూ "చెబితేనే వదిలేది! మీ స్థావరమేది?" ప్రశ్నించాను.

"స్థావరం.... స్థావరం.... షికారి మహల్!"

"మీ నాయకుడు?"

"తెలియదు బాబూ ...!"

"నోర్ముయ్....! చెప్పకపోతే చావే గతి!"

"లేదు బాబూ! నిజంగా నాకు తెలియదు. అయ్యో! జా....జారిపో... దేవుడి....మీద....ప్రమాణం...లాగండి బా....బోయ్....

బాస్ ఎవరో వాడికి నిజంగానే తెలియదు. వాణ్ని రక్షించేందుకు ముందుకు వంగుతున్నంతలో పులి ఒక్కసారిగా పైకి యెగిరి తన రెండు పంజాలూ వాడి కాళ్ళకు గుచ్చి పట్టుకుంది.

అంతే! కెవ్వున అరుస్తూ కిందకు జారిపోయాడు వాడు. ఒకే ఒక నిముషం అరుపులూ, ఆర్తనాదాయి. పిదప అంతా నిశ్శబ్దం. ఎవరు తీసిన గోతిలో వాళ్ళే పడతారంటారు. చివరికి ఇక్కడ జరిగిందదే! బాధగా మొహం ప్రక్కకు తిప్పుకున్నాను.

షికారి మహల్!

సోనార్ అడవుల్లో ప్రవేశించేముందు ప్రభుత్వకార్యాలయంలో మొత్తం అడవికి సంబంధించిన మేప్ చూశాను. మేప్‌లో చూసిన ప్రతి చిన్న విషయమూ గుర్తే నాకు.

సోనార్ అడవికి తూర్పు దిశలో దట్టమయిన అడవి ప్రాంతంలో పర్వతాల మధ్య వుంది షికారి మహల్! పూర్వం రాజుల కాలంలో నిర్మించబడిన ఆ భవనం రాజులకు విడిదిగా ఉపయోగపడేది. ఇప్పుడది ప్రభుత్వ లెక్కల్లో ఇంచుమించు శిథిలమయిపోయినట్టే!

వెనక్కి తిరిగి వెళితే ఫారెస్టు ఆఫీసులో షికారి మహల్‌కి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు! కానీ వెనక్కి తిరిగివెళ్ళే ఉద్దేశమే లేదు నాలో. ఏదోలా ఆ షికారి మహల్‌ని పట్టుకొని ఆ సంగతేదో తేల్చుకునే వెనక్కి మళ్ళేది. తూర్పు దిశగా ప్రయాణం సాగించాను.

సువిశాలమయిన సోనార్ అడవిలో షికారి మహల్‌ను వెదకడమంటే అసామాన్య వ్యవహారమేంకాదు. రాత్రీ పగలూ భేదం మరచి, ఎక్కడికక్కడ దొరికిన కాయ కసరులు నములుతూ షికారి మహల్‌ని అన్వేషిస్తున్నాను. అడవిలో అప్పుడప్పుడూ ఎదురయిన ఆటవికులను ఆ మహల్ గురించి ప్రశ్నిస్తే; అదేదో వినకూడనిదయినట్టు హడలిపోతూ పారిపోతున్నారు.

మిట్టమధ్యాహ్నంవేళ తిరిగి తిరిగి అలసి ఓ చెట్టుకింద కూలబడ్డాను. దాహం, ఆకలి, రెండూ ఒకటికొకటి తోడవుతూ నన్ను బాధ పెడుతున్నాయి.

ఓ కోయ ముసలాడు ఆ దారినపోతూ అగుపించాడు. లేని వుత్సాహం తెచ్చుకుంటూ అడిగాను వాణ్ణి షికారి

మహాల్ ఎక్కడో తెలుసా అని. చెబుతాడనే నమ్మకం నాకు లేదు. అయినా ఏదో ఆశ....అంతే!

ఆ ముసలాడు నన్నోక్షణం ఆశ్చర్యంగా చూసి "అదేమిటి దొరా! ప్రక్కనే షికారి మహల్‌ని వుంచుకొని అట్టా అడుగుతుండావు. అదో! ఆ దిబ్బ దిగితే అడనేగదా! ఆ మహల్!" అన్నాడు.

నేను దిగ్గున లేచి "ఎక్కడ షికారి మహల్!" అన్నాను.

కోయ ముసలాడు నన్ను రమ్మన్నట్టు తలవూపి తన చేతిని చెట్ల గుంపుకేసి చూపుతూ "అడనుండి చూస్తే తెలుసుద్ది దొరా" అంటూ నడవసాగాడతను. నేను వడి వడిగా అతణ్ని అనుసరించాను.

ఓ కొండ గుట్ట యొక్క పాదల వెనక చేరాడు ముసలాడు. కొమ్మల్ని చేతులతో ప్రక్కకు వంచుతూ మొహాన్ని ముందుకు చాచి "అదే దొరా మహల్" అన్నాడు చిన్నగా. నేను ఆత్రంగా ముందుకు వంగాను.

కింద లోయలో ఒక పాడుబడిన భవనం కనపడింది. పురాతన పద్ధతులలో నిర్మించబడిన విశాలమయిన భవనమది. అక్కడక్కడ మనుషులు తచ్చాడుతున్నారు. వాళ్ళందరి చేతుల్లోనూ తుపాకులు వున్నాయి.

ఇంతలో నా ప్రక్కన వున్న ముసలాడి కదలికలో అసహజం గోచరించి ప్రక్కకు తిరగబోయాను. కానీ అప్పటికే ఆలస్యమయింది. ముసలాడు తన ఎడమ చేతిలో వుంచిన గుడ్డతో నా మొహాన్ని అద్దాడు గట్టిగా. క్లోరోఫాం వాసన గుప్పుమంది ఒకేసారి. కళ్ళు చీకట్లు కమ్మి స్పృహ కోల్పోతున్న నాకు ముసలాడు పకపక నవ్వుతుండడం వినపడుతోంది లీలగా.

8

చల్లదనం ఒక్కసారిగా ముఖాన్ని తాకినట్లయి భారంగా కనులు తెరిచాను.

కాళ్ళూ చేతులూ కట్టబడి నేలమీద పడివున్నాను. మరోసారి పాత్రతో నా మొహంమీద నీళ్లు చల్లేందుకు సిద్ధపడుతున్న వ్యక్తి నేను కళ్ళు తెరవడంతో వెనక్కి పోయాడు.

"గుడ్! తెలివి వచ్చిందన్నమాట" పకపక నవ్వాడు బాస్. అదే పీలస్వరం. అతడు కావాలని గొంతు మారుస్తున్నట్టు మొదటే అర్థమైంది నాకు. అయినా అసలు స్వరం పోలిక దొరకటంలేదు. మాస్క్ మూలంగా మొహం కనపడడంలేదు.

"మిస్టర్ విక్రమ్! నిన్ను ఈ రకంగా మా స్థావరంలో సన్మానించవలసిన పరిస్థితి నిజంగా నాకు బాధగావుంది" అన్నాడు బాస్ చిన్నగా నవ్వుతూ.

నేను మొహం ప్రక్కకు తిప్పుకున్నాను.

"మిస్టర్ విక్రమ్! నీవు అసాధారణమయిన తెలివీ, బలమూ కల వ్యక్తివి. తుపాకీ గురిపెట్టడంలో సాటిలేని మేటివి. ఒప్పుకుంటున్నాను. కానీ విక్రమ్! మాకు సంఖ్యా బలంవుంది. వీటికి తోడు ఆధునిక ఆయుధ సంపద వుంది. ఈ అడవిలో నా మాటకు తిరుగులేదు. సో....వుయ్ మేక్ ఏ డీల్ ...నీకు ఎంత డబ్బు కావాలో తీసుకో. మాతో కలిసి పనిచెయ్. ఇక ఇక్కడ మనకి తిరుగుండదు..." అంటూ నా మొహంలోకి చూస్తూ ఆగాడు బాస్.

నేను మాటాడలేదు. నిజానికి ఇటువంటి వారితో మాటలూ వ్యర్థమే. కానీ నా మౌనాన్ని మరోలా అర్థం

చేసుకున్నాడు బాస్. నాలో యేదో భావసంఘర్షణ వూహించుకుంటూ బాస్:

"మిష్టర్ విక్రమ్! నీ నిర్ణయం ఇప్పటికిప్పుడు చెప్పాలనేంలేదు. నీకు ఇంకా నాలుగు గంటల వ్యవధి యిస్తున్నాను. బాగా ఆలోచించుకో" అంటూ లేచి నిలబడి వెనక్కి తిరగబోతూ ఆగి...."కానీ ఒక మాట....! ఈ గడువును ఆసరాగా తీసుకొని తప్పించుకునే ప్రయత్నం చెయ్యకు....ఓ....కె" అని చెప్పి వెళ్ళిపోయాడు.

ఆతడి అనుచరులు నన్ను ఓ చిన్న గదిలో బంధించి తలుపు మూసేశారు.

ఐదారడుగుల వెడల్పులో ఒకే ఒక కిటికీగల చిన్న గది. కిటికీలో వున్నది నాలుగే ఇనుప వూచలు. ఏదోలా శ్రమపడి వాటిని పీకినా నాలాంటి మనిషి అందులో దూరడం అసాధ్యం. కొండరాళ్ళతో కట్టిన రాతిగోడలు; చీమ దూరే సందుకూడా లేనట్టున్నాయి. రాకపోకలకు ఉపయోగపడే తలుపు ఒక్క పదార్థం!

బయట కాపలాకూడా వున్నట్టుంది. అపుడపుడూ తలుపుకి వున్న చిన్న కన్నంమీద అడ్డు తొలగించి కాపలావాడు లోనికి చూస్తున్నాడు. నాలుగయిదు గంటలు అలా గడిచిపోయాయి. తెగించి యేదో ఒకటి చెయ్యాలి.

కాపలావాడు అప్పుడే తలుపు కంతలోనుండి గదిలోకి చూసి తిరిగి మూత లాగేసాడు. దాదాపు మరో గంట వరకూ ఆ మూత తిరిగి తెరవడు వాడు.

నెమ్మదిగా దొర్లుతూ గోడను చేరాను. చేతులు వెనక్కి కట్టబడి వున్నాయి ప్రక్కకు దొర్లి మోకాళ్ళమీద లేచి నిల్చున్నాను. వెనక్కి తిరిగి చేతికట్లు రాతిగోడకు

రాపాడించసాగాను.

కాళ్లు రెండు బిగించి కట్టడంవలన నిల్చోవడం కష్టంగా వుంది. బరువంతా చేతులమీదే వుంచి వాటిని పైకీ కిందికీ జరుపుతున్నాను. ఒకోమారు బాలెన్స్ తప్పి కింద పడిపోతున్నాను. తిరిగి లేచి పనికానిస్తున్నాను. అప్పుడప్పుడూ చేతులు గోడకు రాసుకుంటూ చర్మం ఒరిసిపోతున్నది. చెమటా రక్తమూ యేకమయి భరించ రాని మంట, బాధ. పళ్లు బిగువున పనిచేస్తున్నాను.

ఇంతలో తలుపు దగ్గర అడుగుల సవ్వడి వినపడింది. చటుక్కున నేలమీదపడి మునుపటి స్థానంలోకి దొర్లాను. తలుపు కంత తెరుచుకుంది. ఓ నిముషం కదలకుండా పడివున్నాను. తిరిగి మూత వేసిన చప్పుడయింది.

త్వర త్వరగా దొర్లి యధాస్థానం చేరాను. అర గంటలో కట్లు తెగిపోయాయి. నిల్చున్నవాడిని ఆ పళంగా గోడకు జారి కూర్చున్నాను. చేతులతో కాళ్ళకు వున్న కట్లు విప్పాను. కొద్దిసేపు నేలమీద చతికిలబడి విశ్రాంతి తీసుకున్నాను.

తిరిగి తలుపుకంత తెరుచుకునే సమయం దగ్గరపడు తుంది. లేచి బద్ధకంగా వళ్ళు విరిచాను. కాళ్ళూ చేతులూ అప్పటివరకూ కట్టబడి వున్న కారణంగా మొద్దుబారి వున్నాయి. చకచకా ఓ యాభై బస్కీలు కొట్టాను. పట్లన్నీ వదిలాయి. తలుపు దగ్గర తిరిగి అడుగుల చప్పు డవుతోంది.

తలుపు ప్రక్కన గోడకు జారబడి నిలబడ్డాను. కంతలోనుండి చూసే వ్యక్తికి నేనిప్పుడు కనపడే అవ కాశంలేదు. ఏం జరుగుతుందో చూడాలి! అన్నిటికీ సిద్ధ మయ్యే వున్నాను. తలుపు మూత తెరుచుకుంది. గోడకు

బల్లిలా అతుక్కున్నాను.

"ఆఁ!!!" అనే ఆశ్చర్య ప్రకటన ఒక్కసారిగా వినపడింది తలుపుకి అటునుండి. కొద్దిసేపు బోనులోపడ్డ ఎలకలా ఆ మనిషి తలుపు దగ్గర తచ్చాడిన చప్పుడు. వాడిప్పుడేం చేస్తాడు? నలుగుర్ని పిలుస్తాడా? ఒక్కడే తలుపు తెరిచి లోనికి వస్తాడా? ఆ నిర్ణయంమీద ఆధారపడివుంది తన భవిష్యత్తు!

9

తలుపు తాళం తెరుస్తున్న చప్పుడవుతోంది. ఊపిరి బిగించాను. ఓరగా తెరుచుకుంది తలుపు. మనిషి తల మాత్రమే లోనికి వచ్చింది. నన్ను చూస్తూనే దిగ్భ్రాంతుడవుతూ తలను తిరిగి వెనక్కి లాక్కోబోయాడా వ్యక్తి.

నేను అదే క్షణంలో మెరుపునుమించి వేగంగా కదిలాను. ఆ తలను ఎడమచేతితో జుట్టుపట్టి లోనికి లాగడం కుడిచేతిని కత్తిలా చాచి మెడమీద శక్తికొద్దీ కొట్టడం ఒకేమారు జరిగాయి. దొంతరగా పేర్చిన ఇటుకల్ని ఒకే దెబ్బకు మధ్యకు బద్దలు కొట్టగల కరాటే దెబ్బ అది. కాపలా వ్యక్తి మెడ ఫట్‌మంటూ విరిగి నా చేతుల్లో కిక్కురుమనకుండా వాలిపోయాడు.

క్షణమయినా ఆలస్యం చెయ్యక అతడి దుస్తులువిప్పి నాదుస్తులమీద తొడుక్కున్నాను. శవాన్ని ఓ మూలకు లాగాను. తలుపు యెప్పటిలా తాళంవేసి తుపాకీ చేతబట్టి బయట నిలబడ్డాను కొద్దిసేపు. అంతా సవ్యంగానే వుంది. తల వంచి నెమ్మదిగా ముందుకు అడుగువేసాను.

భవనం అంతర్భాగంలో చిట్టచివరి ప్రాంతమది. భవనంలో అక్కడక్కడా కాగడాలు వెలుగుతూ గోడలకు వేలాడుతున్నాయి.

చిన్న వరండాలో అడుగు పెడుతూ చటుక్కున గోడ ప్రక్కకు తప్పుకున్నాను. విజిల్ వూదుకుంటూ హుషారుగా నడిచివస్తున్నాడొకడు. భుజాన తుపాకీ వుంది. గోడ చాటున నిలబడ్డాను.

ఆ వ్యక్తి మలుపు తిరుగుతూ హఠాత్తుగా చూసాడు నన్ను. అతిడు భయంతో నోరు తెరుస్తూ వుండగా నా అరచేయి కత్తిలా అతిడి నుదుట తాకింది. కపాలం ఫట్ మంటూ రెండుగా విడిపోయింది. అతణ్ని అక్కడేవున్న ఖాళీ చెక్కపెట్టెల మధ్యకు లాగాను.

వరండా దాటి ముందుకు వెళుతుండగా మరో అడ్డంకి....! ఇద్దరు వ్యక్తులు అవతలి వసారా మెట్లు దగ్గర యెదురెదురుగా కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. బయొనెట్లు అమర్చబడిన తుపాకులు వారి వెనుక గోడలకు జారబడి వున్నాయి. కొద్దిక్షణాలు తటపటాయిస్తూ నిల్చున్నానక్కడే. ఇంతలో!

"ఒరేయ్! అగ్గిపెట్టె వుందా?" సిగరెట్ తీసి అడిగాడొకడు రెండవవాణ్ని.

రెండోవాడు జేబులు తడుముతూ పెదవి విరిచాడు. "సిగరెట్ వెలిగించుకొస్తానుండు" అని లేచి అటు వెళ్ళాడా వ్యక్తి. రెండోవాడు పెద్దగా ఆవులిస్తూ గోడకు జారబడి "వెధవరా! నాకిక్కడ బోరుకొడుతుంది" అన్నాడు. కొద్దిక్షణాలు గడిచాయి. గోడకు జారబడిన వాడలా తల ముందుకు వేలాడేసాడు. అదే అదనుగా భావించి నెమ్మదిగా అడుగులువేస్తూ ముందుకు సాగాను. వాణ్ని దాటి రెండడుగులు వేసానో లేదో చటుక్కున తలపైకెత్తి:

"ఏయ్....! ఎవరున్నువ్వు...ఇలారా..!" అని వెనక్కి

పిల్చాడు వాడు.

నేను వెనక్కి తిరుగుతూనే హఠాత్తుగా ఎగిరి వాడి మీద పడ్డాను. ఊహించని సంఘటనకు ఒక్కసారిగా వుక్కిరిబిక్కిరయ్యాడా వ్యక్తి. వాడి పీక సరిగ్గా నా చేతుల్లో అమరింది. ఊపిరి అందక గిజగిజలాడాడు' తన చేతులతో నా చేతుల్ని వెనక్కి నెట్టాలని ప్రయత్నించాడు. కానీ నావి ఉక్కు హస్తాలు. నిముషాల్లో కళ్ళు నాలుకా వెళ్ళబెట్టి ప్రాణం వదిలేసాడా వ్యక్తి.

దౌర్భాగ్యుడు కోరి మృత్యువును ఆహ్వానించాడు.

వాడి శవాన్ని పూలకుండీల మధ్యకు లాగేసాను. చేతులు దులుపుతూ పైకి లేస్తుండగా ప్రక్క వసారాలో అడుగుల చప్పుడయింది. సిగరెట్ ప్రాణి తిరిగివస్తూ వుండొచ్చు.

అటూ ఇటూ చూసి చచ్చినవాడు మొదట కూర్చున్న స్థలంలో చతికిలబడ్డాను. గుప్పు గుప్పున సిగరెట్ పొగ వదులుతూ రైలింజన్‌లా వచ్చాడా వ్యక్తి. తల ముందుకు వాల్చి నిద్ర నటించసాగాను.

వచ్చినవాడు "నా కొడకా కుంభకర్ణుడి తమ్ముడివి!" అంటూ నా కాళ్ళను తన కాలితో ప్రక్కకు తోసి తను ఆ స్థలంలో కూర్చున్నాడు.

నేను ఒక్క వుదుటున లేచి వాడి పైపడ్డాను. పాపం! మిత్రులిద్దరికీ భగవంతుడు ఒకే రకమయిన చావు రాసి పెట్టినట్టున్నాడు. వీడూ పీక దగ్గరే దొరికాడు. వీడి మెడ మరీ కోడి మెడలా వుంది. టుప్పుకున చచ్చి వూరుకున్నాడు. వీడి శవాన్ని ముందు శవం ప్రక్కన చేర్చి ముందుకు అడుగేసాను.

ఓ గదిలో దీపం వెలుగుతూ వెలుతురు వరండాలో

పడుతోంది. తలుపుకి ఇరుప్రక్కలా వరండాలో చెక్క పెట్టెలు దొంతరలుగా పేర్చి వున్నాయి. బహుశా అదేదో స్టోరయివుండాలి. చెక్క పెట్టెలు చాటుగా గది లోకి తొంగిచూశాను. కళ్లు జిగేలు మన్నాయి. అది అమ్మ్యూనిషన్ స్టోర్! తన వెతుకులాటకూడా ప్రస్తుతం దీనికోసమే. లోపల టేబిలుముందు కూర్చొని దీక్షగా యేదో లెఖ్ఖలు రాసుకుంటున్నాడా వ్యక్తి. చప్పుడు కాకుండా లోనికి ప్రవేశించాను.

కుర్చీని సమీపిస్తుండగా నా అడుగుల సవ్వడి పసిగట్టి చటుక్కున తలతిప్పాడా వ్యక్తి. నేను ఒకే అంగలో వాణ్ణి సమీపించాను. పెద్దగా నోరు తెరిచే వాడి ప్రయత్నానికి అడ్డుకట్టవేస్తూ ఎడమచేతితో వాడి నోటిని మూసి కుడిచేతిని చాచి మెడమీద కొట్టాను. కిక్కురుమనకుండా బల్లమీదకు వాలిపోయాడా వ్యక్తి.

గది తలుపులు ఓరగా వేసాను. సోనార్ అడవులు ఇన్నాళ్ళుగా వీళ్ళ చెప్పుచేతుల్లో యెలా వున్నాయో లోపల సరంజామా చూస్తే అర్థమవుతుంది ఎవరికయినా. ఈ గదిలో వున్న అమ్మ్యూనిషన్ నిజానికి ఒక ఆర్మీ స్టోర్ లో సయితం వుండదేమో. మెషిన్ గన్స్ వంటి ఆధునికమయిన ఆయుధాలతోపాటు డైనమైట్ లు, మినీ బాంబులవంటి శక్తివంతమయిన విధ్వంసక పరికరాలు రాసులు పోయబడి వున్నాయి.

షర్టు టక్ చేసి లోపల వీలయినన్ని బాంబులు వేసాను. మెషిన్ గన్ చేతబట్టి బయటకు నడిచాను. భవనానికి అదే ఆఖరు ద్వారం. ద్వారం ప్రక్కనే ఒక టేబిలు చుట్టూ నలుగురు వ్యక్తులు కూర్చొని దీక్షగా పేకాడుతున్నారు. తెరిచి వున్న ద్వారంగుండా అడవి దర్శన

మిస్తోంది. చల్లగాలికి చెట్లు వూగుతూ చీకటిలో మునిగి వుంది బయట వాతావరణం. ఈ ఒక్క అడ్డంకి దాటితే అడవిలో పడిపోయినట్టే లెఖ్ఖ!

ఆట మంచి పట్టులో వున్నట్టుంది. రెప్పయినా వాల్చక ఆటలో మునిగి వున్నారంతా. ఇంతకుమించి సమయం దొరకదు. నెమ్మదిగా అడుగులు వేస్తూ పాత కాపులా తల వంచుకుపోతున్నాను.

ఇంతలో హఠాత్తుగా లోపలినుండి కేకలు వినపడ్డాయి. లోపల నా నిర్వాకమంతా బయటపడినట్టుంది.

“ఖైదీ తప్పించుకున్నాడు....మన వాళ్ళను చంపేశాడు....పట్టుకోండి వాణ్ని....నరకండి....చంపండి....” కేకలతో పరుగులతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది.

పేకాట గ్యాంగు ఉలిక్కిపడుతూ పేకలు జారవిడిచారు. వారి దృష్టి సరిగ్గా నామీదే పడింది.

“అదుగో....వాడే! .... పట్టుకోండి....” నా వంక చేయి చాపి అరిచాడొకడు. పేకాట సభ్యులు ఒక్కసారిగా ముందుకు మూగారు. వాళ్ళ చేతుల్లో తుపాకులు సిద్ధంగా వున్నాయి.

క్షణం ఆలస్యమయితే నా శరీరం తుపాకీ గుళ్ళతో నిండిపోవడం ఖాయం. షర్టులో చేయి జొనిపి ఓ మినీ బాంబు లాగడం ఆ ఊపున వారిమీదకు విసరడం ఒకే క్షణంలో జరిగిపోయింది. మినీ బాంబు నా ఊహకు నాలుగురెట్లు శక్తివంతమయినది.

కళ్లు మిరుమిట్లు గొలుపుతూ భయంకరమైన విస్ఫోటనం. భవనం మొత్తం కంపించిపోయింది ఒక క్షణం. బల్ల దగ్గర మనుషులతో బాటు బల్ల సయితం కనపడలేదక్కడా!

బాంబు అదురుకు ద్వారం దగ్గర పైకప్పు కూలి ద్వారం మూసుకుపోయింది. మరి కొద్ది క్షణాల్లో ఆ ప్రాంతంలో ఏం జరుగుతుందో చెప్పడం కష్టం! వెంట నే వెనక్కి పరుగుతీశాను.

చెక్క మెట్లు కనబడ్డాయి. పైన బాస్ కీచుగొంతు వినపడుతోంది. "నరకండి వాణ్ని....చ ం ప ం డి.... పోగులు పెట్టండి!" పిచ్చివాడిలా అరుస్తున్నాడు బాస్.

చకచకా మెట్లెక్కుతుండగా పైనుండి ఓ అరడజను మంది తుపాకులు పేలుస్తూ మెట్లు దిగుతున్నారు. మెట్లు దిగే సమయంలేదు. అంత ఎత్తునుండి ప్రక్కకు గెంతి మెట్లు దిగువకు దొర్లిపోయాను. వాళ్ళంతా మెట్లు దిగి గుడ్డిగా ముందుకు పోతున్నారు. చప్పట్లు చరిచాను. వాళ్ళు వెనుతిరిగారు. నా చేతిలో మెషిన్ గన్ నిప్పు రవ్వలు జల్లింది. ఆర్తనాదాలు చేస్తూ కుప్పలా కూలారంతా!

"వాడు మెట్ల కింద వున్నాడు .... రండి....! రాస్కెల్స్....ఎక్కడ చచ్చార్రా...." పెద్దగా అరుస్తున్నాడు బాస్. బాస్ దృష్టి చెక్క మెట్లమీదే వుంది.

అటునుండి చెక్కమూలం పట్టుకొని బాస్ కంట పడకుండా పైకెక్కాను. ముందుకు చూస్తూ తనవాళ్ళను రమ్మని అరుస్తున్నాడు బాస్. పూర్తిగా ముసుగు ధరించి వున్నాడు. ప్రక్కనుండి ఎగిరి కాళ్ళతో తన్నాను. బంతిలా రయిగిరి గోడకు కొట్టుకొని కిందపడ్డాడు. ముందుకు దూకి ఒక చేత్తో వాడి కాలరు పట్టి రెండో చేత్తో ముసుగు లాగబోతూండగా బాస్ తన చేతులతో నా ప్రయత్నాన్ని అడ్డుకోసాగాడు.

ఇంతలో ప్రక్కగదిలో నుండి బాస్ అనుచరులు బిల బిల లాడుతూ బయటపడసాగారు. బాస్‌ను వదిలి మెషిన్ గన్ని అటు తిప్పాను. బాస్ అనుచరులు ఎక్కడివాళ్ళక్కడే కుప్పకూలారు. ఆ పని పూర్తి చేసి ఇటు తిరిగే సరికి బాస్ కనపడలేదక్కడ.

పిరికి విధవ పలాయనం చిత్తగించాడు. కానీ బాస్ గోడకు కొట్టుకుపడిన చోట మెరుస్తూ కనపడిందేదో!

అంగుళం పొడవున ఎర్రరంగు వేయబడిన బొటనవ్రేలి గోరు! భద్రంగా జేబులో వేశాను.

భవనంలో మిగిలిన బాస్ అనుచరవర్గం యావత్తూ నా మెషిన్ గన్ బారిన పడి మరణించారు. భవనంలో చెలరేగిన అగ్ని క్రమేపీ దావానలమై భవనమంతా ఆక్రమిస్తోంది. ఇక కొద్ది సేపటిలో జరగబోయేది వూహించి భవనం నుండి బయటపడ్డాను.

అప్పటికి మంటలు ఆర్మ్స్ స్టోర్‌లో ప్రవేశించి వుంటాయి. భవనం చిన్నాభిన్నమవుతూ శిథిలభాగాలు ఆకాశంలోకి ఎగిరాయి. పెద్దగా నిట్టూరుస్తూ గుర్రాన్ని అదిలించాను.

10

తూర్పున అరుణోదయమయింది. కిలకిలారావాలతో అడవి నిద్ర మేల్కొంటోంది.

ఫారెస్టు రేంజ్ ఆఫీసు ప్రశాంతంగా వుంది. లోపలి నుండి చేతిలో పెద్ద సూట్ కేసుతో బయట అడుగు పెట్టాడు ఆఫీసర్ అగర్వాల్! కర్ర మెట్లు దిగుతూ నన్ను చూసి టక్కున ఆగిపోయాడు.

"అరె....విక్రమ్! ఎక్కడికెళ్ళావు యిన్నాళ్ళు.... నేను నీ కోసమే బయల్దేరుతున్నాను...." అన్నాడు

తబ్బిబ్బుగా.

ఆశ్చర్యం దిగకుండా చిరునవ్వు నవ్వాను.

"మిస్టర్ అగర్వాల్! నిన్ను చూస్తూంటే నాకు గజేంద్రమోక్షంలో విష్ణుమూర్తి గుర్తొస్తున్నాడు. చేతిలో యే తుపాకీ లేకుండా వెంట ఒక మనిషయినా రాకుండా కేవలం ఆ సూట్ కేసులో నన్ను ఏ విధంగా అడవి దొంగల బారి నుండి కాపాడాలని బయల్దేరి నట్టు...." అన్నాను కాస్త వెటకార ధోరణిలో.

ఆ మాటకు అగర్వాల్ నిష్ఠూరంగా "విక్రమ్! నీ మాటలు విచిత్రంగా వున్నాయి. నిన్నొకమారు అడవి దొంగలబారి నుంచి కాపాడలేదా!?" అన్నాడు....

"అవును కాపాడావు....!"అని కొద్ది సేపాగి జేబులో నుండి షికారి మహల్ లో దొరికిన వేలిగోరు ముక్కను తీసి అగర్వాల్ దిక్కుగా విసురుతూ "అందుకనే నువ్వు మహల్ లో విరగ్గొట్టుకున్న దీనిని భద్రంగా నీకు అప్పగి స్తున్నాను" అన్నాను.

అగర్వాల్ ఓ క్షణం నావంక నిశ్చేష్టుడయి చూస్తూ కిందపడిన గోరును అందుకునేలా ముందుకు వంగి కోటు జేబులో రివాల్వర్ ని మెరుపువేగంతో బయటకులాగాడు. రివాల్వర్ నా వంక తిరిగి పేలేలోగా అతని చేతిలో రివాల్వర్ గాల్లోకి ఎగిరింది.

అగర్వాల్ దొరికిపోయినవాడిలా వెర్రి మొహం వేస్తూ నా చేతిలో పొగలు కక్కుతున్న పిస్తోలువంక చూడ సాగాడు. పిస్తోలును తిరిగి హోల్ స్టర్ లో వుంచుతూ గుర్రం దిగాను.

"మిస్టర్ అగర్వాల్! అమాయకుడిలా అగుపించే అసాధ్యుడివి నువ్వు. అతి తెలివికిపోయి నీ మనుషుల బారి

నుండి నన్ను కాపాడిన సంఘటనను కావాలని సృష్టించావు. నిజానికి అప్పుడే నా మనసులో యేదో మూల నీమీద కొంత అనుమానం కలిగింది.

ఆ సందర్భంలో నీ వెంట వున్న గార్డులకు రెట్టింపు అడవి దొంగలున్నారు. అయినా వాళ్ళు ఎటువంటి ప్రతిఘటనా లేకుండా పారిపోయారు. ఎందరో వుద్దండులైన పోలీసు సిబ్బందిని నిర్దాక్షిణ్యంగా వధించిన ఆ హంతకులు అంత సులభంగా వెన్నిచ్చి పోవడానికి కారణమేమిటి? అంతేకాదు! ఇందర్ని మట్టుపెట్టిన ఆ దుండగులు నిన్ను మాత్రం యెందుకు వదిలిపెట్టినట్టు? అంటే నీకు వాళ్ళతో ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబంధం వుండి వుండాలి ....అవునా?" అన్నాను నవ్వుతూ.

ఆ తర్వాత కొద్దిసేపు అగర్వాలు తల వంచుకొని వుండిపోయాడు. పిదప కళ్ళ వెంబడి నీళ్ళు రాలుతూ వుండగా తలెత్తి గద్గదస్వరంతో ....“విక్రమ్ బేటా! జరిగిందేదో జరిగిపోయింది.... పెద్దవాణ్ని ....అన్నీ వదులుకొని ఏ దూరతీరాలకో పోతాను ....ఒంటరివాణ్ని ....నీకు తెలుసుగా! నా అనుచరులంతా మరణించారు ....ప్రమాణం చేస్తున్నాను ....ప్లీజ్! నన్ను వదిలేయ్....” అంటూ చేతులు జోడించి ముందుకు వస్తున్నాడు.

వాస్తవానికి అగర్వాల్ పశ్చాత్తప్తుడయి హృదయపూర్వకంగా ఆ మాట అనివుంటే పరిస్థితి యేరకంగా వుండేదో! ఎందుకంటే ఈ అసైన్‌మెంటులో సర్వాధికారాలూ నావే! కానీ కుక్కతోక వంకర. ఎట్టి పరిస్థితులలోనూ అది నిటారుగా వుండదు, వుండలేదు.

నా చేరువకు వచ్చిన అగర్వాల్ నేను వూహించని రీతిలో తన బూటుకాలితో నేలమీద తన్ని నా కళ్ళల్లో

ఇసుక పరేలా చేశాడు. అడుగుల చప్పుడుబట్టి అగర్వాల్ తొలుత తన చేతిలో నుండి నేను ఎగురగొట్టిన పిస్తోలు పడివున్న దిశగా పరుగెత్తుకున్నట్టు అర్థమయింది నాకు.

అగర్వాల్ నిజానికి చక్కని పథకమే ఆలోచించాడు. కానీ అతడు ఆలోచించక వదిలిపెట్టి విషయం; అది పొరపాటున తెలియకనే అనుకోండి: ఒకటుంది!

అదేమిటంటే! తేనెటీగను సయితం దాని రెక్కల ఝుంకారం ఆధారంగా కళ్ళు మూసుకొని పిస్తోలుతో కాల్చి పడగొట్టగలను. ఇసుక పడిన కళ్ళు తెరిచే ప్రయత్నం చెయ్యలేదు. అగర్వాల్ తిరిగి తన పిస్తోలును పొందగలిగితే నా పని ఆఖరు.

హోల్స్టరు నుండి పిస్తోలు లాగి అగర్వాల్ కాలి సవ్వడి ఆధారంగా రెండుసార్లు షూట్ చేశాను.

కెవ్వుమనే అగర్వాల్ ఆర్తనాదం వెనక అతని శరీరం నేలమీద పడుతూ దబ్బున చప్పుడయింది. దీర్ఘంగా నిట్టూర్చి దాపులనే వున్న గుర్రాలు నీళ్ళుతాగే తొట్టిలో మొహం పెట్టి ఇసుకను వదిలించుకున్నాను.

గుర్రాన్ని అధిరోహిస్తూ అగర్వాల్ శరీరం పడివున్న దిశగా చూశాను. తెరచుకున్న అతని నోటిలోకి అప్పుడే ఈగలు రాకపోకలు ప్రారంభించాయి. అగర్వాల్ అంతంతో అడవిదొంగల ముఠా పూర్తిగా నాశనమయినట్టే. రాజస్థాన్ ప్రభుత్వం ఇకమీదట నిశ్చింతగా వుండొచ్చు.

గుర్రాన్ని అదిలించాను. స్వేచ్ఛావాయువులు పీల్చుతూ పెద్దగా సకిలించి ముందుకు సాగింది అశ్వం.

—: అయిపోయింది :—